
# ★ నాకు బాగా నచ్చిన వృత్తి ఒక్కటే కనిపిస్తూంది....

కొడవటిగంటి
కుటుంబరావు

★




స్వరాజ్యం వచ్చేస్తున్నది. మన మొహం మనం తెస్తామా ఏమిటి? ధర్మాత్ములు ఆ క్రిప్సూ, ఆ అట్లీ ఆ మౌంట్‌బాటన్ మొదలైనవాళ్లున్నారు గనక, మనం వద్దురా బాబూ, అంటున్నా వినకుండా మనకు స్వరాజ్యం ఇచ్చే తీరాలంటున్నారు, మనం పుచ్చుకునే తీరాలి. విధి లేదు. గత్యంతరం అసలే లేదు.

అంచేత స్వరాజ్యం వచ్చేస్తున్నది. వచ్చిందే అనుకోండి. ఒక్కసంవత్సరం కళ్లుమూసి తెరిచే లోపుగా చక్కావచ్చేసి ఎదురుగా నిలబడి ఉంటుందన్నమాట. ఘట్టిగా ఓ సభ ఏర్పాటుచేసి, ఆహ్వానసంఘం కుదిర్చి, ఆహ్వానసంఘాధ్యక్షుణ్ణీ తదితరుల్నీ ఎన్నుకుని ఈ రాబోతున్న స్వరాజ్యాన్ని సన్మానించేటందుకూ కూడా వ్యవధి లేదన్నమాట. ఎంచేతంటే దొంగవ్యాపారస్తులంతా తలా ఓ కాపు కాసినా మామూలు మహాసభల్లా ఇవికూడా తృప్తికరంగా ఏర్పాటవకుండా ఉన్నాయి. నెలరోజులు టైమున్నా తొక్కిసలాటవుతున్నది. స్వరాజ్యానికి ఆహ్వానం ఇవ్వటమంటే మాటలా!

అయితే నన్ను వేధిస్తున్న సమస్య స్వరాజ్యానికి సన్మానసభలు ఏర్పాటు చేయించటం కాదు— నా స్వార్థం, నా ముక్తి, నా ఆర్థికసమస్య, నా ఉద్యోగసమస్య ఎట్లా పరిష్కరించుకోవటమా అని. ఇప్పటినుంచీ ఒక ప్రణాళికా, ఒక కార్యక్రమంమీదిగా నడిస్తేనేగాని స్వరాజ్యం వచ్చేసరికి దాని పూర్తి ఫలితం దక్కించుకునే స్థితిలో ఉండనేమోనని నా బెంగ.

ఇంతవరకూ అంటే దేశం పరాధీనంగా ఉండి నావంటి బుద్ధిమంతు లెక్కిరావటానికి వీల్లేక

పోయింది. ఇకముందు వైస్రాయిదగ్గిర్నుంచీ ప్రభుత్వశాఖల్లో దవాలీబంట్రోతుదాకా అంతా మనవాళ్ళే గనక ఇంత ఇబ్బంది ఉండదు.

మీరు గమనించారో లేదో, పెద్దతే నేనున్నాను. వైస్రాయిగా ఎవరుంటారో చెప్పలేను గాని నాకు తెలిసిన పెద్దపేర్లు కొన్ని తీసుకుని వాళ్ళకి నేనెంత దగ్గిరిగా ఉన్నానా అని ఆలోచిస్తున్నాను. జవహర్లాలు నెహ్రూను బాగా ఎరిగిన ఒకమనిషిని నేను బాగా ఎరుగుదును. గాంధీని బాగా ఎరిగినవారిని బాగా ఎరిగినవారొకరు నాకు బాగా తెలుసు, వల్లభాయి పటేలుతో లంకె అందటంలేదు. నాకూ పటేలుకూ మధ్య మహా ఉంటే ముగ్గురుంటారు. అంతకంటె ఉండరు. ఈ కారణంచేత స్వతంత్రభారతంలో నేను బొత్తిగా అసహాయుణ్ణి అయిపోతానని తోచదు.

అయినా కీడెంచి మేలెంచమన్నాడు. ఈ తోవ మూసేఉందే అనుకుందాం. స్వరాజ్యం వచ్చినాక కాంగ్రెసు పలుకుబడి ఎట్లా ఉండబోయ్యేదీ ఎవరు చూశారు. కాంగ్రెసులో ఉన్న దేశభక్తుల్లో కొందరు కైలాసానికి వెళ్ళి తపస్సు చేసుకోవచ్చు, మిగతావాళ్లు షాపులు తెరవొచ్చు. ఏటాటా, బిర్లా, డాల్మియా, సంఘానియా ఏజెంట్లో పదవు లాక్రమించుకోవచ్చు. వీళ్ళకీ మనకీ మధ్య సహారాఎడారి తప్ప చక్కని హైరోడ్డనేది కనిపించటంలేదు.

ఈ వ్యాపారస్తులు దేశానికి నాయకులే కావటం తటస్థించితే మనంకూడా వ్యాపారంలో ఉద్యోగం చూసుకోవటం బుద్ధికి లక్షణం. మనకు సొంతాన వ్యాపారం పెట్టి సాగించే తాహతు లేదు. విడోస్ అండ్ ఆర్ఫన్స్ లిమిటెడ్ పెట్టి సాగించినా ఈ పెరాకతాలు మనని మట్టం చేసేస్తాయి గాని మరోటి కాదు. అమ్మటం కొనటం ఉద్యో

గం మనకు తెలిసి చావదు. అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి అన్న సామెత మనబోటివాళ్లను గురించే చెబుతారు. పరిశ్రమల్లో చేరి పనిచెయ్యటానికి పరిజ్ఞానం లేదు. మనం చదివిన డికెన్సు, షా, వెల్సు, టాల్‌స్టాయి మొదలైనవాళ్ళ పుస్తకాల్లో ఉండే జ్ఞానంతో పిండిమరకూడా ఆడదు. అందుచేత మనకున్నదల్లా మనలో ఒకే ఒక ఉద్యోగం... సమ్మెలు భగ్నంచేసే పని.

ఇది నెమ్మదిగా ఉండే ఉద్యోగం కాదు, మనకు తెలుసు. కూలివాళ్లు చెడ్డ గడుసుమీరి పోతున్నారు. వస్తువులకు ధర యావత్తూ కూలి వల్లే ఏర్పడుతున్నదని వాళ్ళు తెలుసుకుంటున్నారు. కాని కూలి దోపిడిచెయ్యడంలో, దీని తస్సగొయ్యా, మంచి డబ్బుంది. పారిశ్రామిక పెట్టుబడిదార్లను చూడండి. సమ్మెలు భగ్నం చేసే వాళ్ళ కండ్లలో ఓ తృణం వచ్చినా హాయిగా వెళ్ళిపోతుంది. ప్రాణాపాయమంటారూ, జాతస్యహి ధ్రువం మృత్యుః, స్వతంత్రభారతంలోకూడా దేశభక్తుడైనవాడు దెబ్బకు వెరిస్తే ఎట్లా?

ఇక్కడకూడా మనం ఆలోచించి మెలగటం మంచిది. సమ్మెలు భగ్నం చెయ్యటానికి సిఫార్సులు కావాలని కాదు. కాని ఇక్కడకూడా కాంపెటిషను జాస్తి. సోషలిస్టుపార్టీలోనుంచీ కమ్యూనిస్టుపార్టీలోనుంచీ జారిపోయినవాళ్ళంతా చక్కగా డబ్బు చేసుకుంటున్నారు. పరాధీనతలో ఉండగానే, మన పరిశ్రమలు గట్టిగా తల ఎత్తక మునుపే, ఈ వృత్తికి మార్క్సు పుస్తకాలు చదివినవాళ్లు సహితం ఎగబడుతుంటే రేపు స్వతంత్రభారతంలో పారిశ్రామిక పాలన సాగితే సమ్మెలు భగ్నంచేసే ఉద్యోగాలకూ, ప్రజల్ని మభ్యపెట్టే ఉద్యోగాలకీ ఎంత పోటీ ఉండొచ్చు. పంచాయితీబోర్డుల దగ్గర్నుంచీ ప్రభుత్వపరిపాలనాసంస్థల వరకూ రాజకీయాలలో అద్భుతమైన అనుభవం గడించి, బ్రహ్మని తిమ్మి, తిమ్మిని బ్రహ్మ చెయ్యటంలో సిద్ధహస్తులైకూడా జాగాలు దొరక్క ఈ ఉద్యోగాల కెగబాకే వారెంతమంది ఉండొచ్చు. కనక ఇక్కడకూడా మనకు నిశ్చింతగా ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం లేదు.

పోనీ కూలిపనే చేసుకుందామంటే, అందులో మాత్రం ఏం సుఖం ఏడిచిందీ? వెట్టిచాకిరీ, తిండికి చాలని కూలీను. సమ్మె చేస్తే తప్ప కూలి ఓ అణాకూడా పెరగదు. సమ్మెచేస్తే పోలీసుల్ని పిలిపించి కాల్పిస్తారు. కూలీలు సమ్మె చేశారనగానే భరించరాని ఆగ్రహం వచ్చి పరవళ్లు తొక్కే వారికి, కూలీలను కాల్చి చంపారంటే చీమకుట్టినట్టున్నా ఉండదు. అదంతా కాక కూలిపని చేసుకోవటానికి ఇప్పట్నుంచీ ప్లానులు దేనికి, పాడు! ముష్టెత్తుకోవటానికి ప్రణాళికలెందుకూ? కూలికోసం ఎత్తేది ముష్టేగా?

ముష్టి అంటే జ్ఞాపకం వచ్చింది. ముష్టికూడా వృత్తే. కొన్నికొన్నిరకాల ముష్టి చాలా ఉపాయంగానే ఉంటుంది. ముష్టెత్తటానికి మానాభిమానాలు తప్ప అడ్డొచ్చేదేమీ లేదు. కాని స్వతంత్రభారతంలో బహుశా ముష్టివాళ్ళకి ముప్పొంటుంది. అందరూ ముష్టెత్తుకుంటే పరిశ్రమలు ఎట్లా నడుస్తాయి? ఆఫ్రికాలోలాగా ఏదో వంక మీద అనుమానంగా కనిపించినవాణ్ణల్లా జైల్లో తోసి వాడిచేత జీతంలేకుండా పరిశ్రమల్లో పని చేయిస్తే తప్ప గిట్టుబాటుగా ఉండదు. అందుచేత బహుశా ముష్టివాళ్ళకి స్వతంత్రభారతంలో ముక్తి ఉండదు.

అయితే ముష్టిలో వీరముష్టి చాలా రకాలుంది. గాయకులూ, చిత్రకారులూ. సాహితీపరులూ మొదలైన కళోపాసకులు అదోరకం ముష్టివాళ్ళు. పారిశ్రామికయుగంలో కళోపాసకుడంటూ ఉండే వాడు కళవల్ల బతకటం ఉండదు. జమీందారీవిధానంలో కళోపాసన సాధ్యమవుతుంది. అంటే కళల్లో కృషిచేసేవాడు కళ మీద బతకనవసరం లేకుండా ఇతరత్రా ఆదాయం కలిగిఉండి తన సంస్కారానికి అనుగుణంగా కళలని ఆరాధిస్తాడు. నన్నయభట్టూ, తిక్కన సోమయాజీ, అల్లసాని పెద్దనా మొదలైనవాళ్లు తమ రచనలను ఆనందంతో చేశారని మనకు ధైర్యం ఉంటుంది. అదే పారిశ్రామికయుగం దగ్గిరికి వచ్చేసరికి కళాకారుడు తనకోసం కాక తనను పోషించేవారికోసం కళలు సృష్టించాలి — కళమీద బతకాలంటే, పారిశ్రామిక అభివృద్ధి సాగినకొద్దీ ఇతరత్రా బతుకు తెరువు చూసుకునే శక్తి కళారాధకుడికి నశిస్తుంది. ఒక్క సోషలిస్టు వ్యవస్థలోనే కళారాధకుడు ప్రీతితో కళలు సృష్టించడమూ, దానిమీద ఆధారపడి జీవించటమూ — ఈ రెండూ సాధ్యమవుతాయి. (ఇదికూడా రష్యాలో లేదనే వారున్నారు. కాని [illegible]

సహితం పారిశ్రామికయుగంలో కళాస్రష్టలు తమ తృప్తికోసం కళాసృష్టిచేస్తూ కళమీద జీవనోపాధి నిర్మించుకోవచ్చునని వాదించబోరు.)

కాని, ఇన్ని అనుకున్నప్పటికీ, నాకు బాగా నచ్చిన వృత్తి ఒక్కటే కనిపిస్తూంది. స్వతంత్ర భారతంలో దానికి తిరుగుండదు, దానికి పాటి ఉండదు. మన పాతసంస్కారం చూసినా, మన ప్రస్తుత స్థితి చూచినా, మన భావి ఊహించినా ఇంతకంటే మంచివృత్తి ఉండదు. అదేమిటంటే, దేవుడైపోవటం.

మనదేశంలో తిండికొరతా, బట్టకొరతా, ఆరోగ్యం కొరతా, ఆయుష్యం కొరతా, జ్ఞానం కొరతా, వివేకం కొరతా—ఎన్నో కొరతలున్నాయి కాని, ఇవేవీ దేవుళ్ళకొరతతో సాటిరావు. మనకు మూడుకోట్ల దేవతలున్నారు, త్రిమూర్తులున్నారు, వాళ్ళ చుట్టాలున్నారు, ఇంకా అంకమ్మా పోలేరమ్మా మొదలైన చిల్లరదేవతలు లక్షలాదిగా ఉన్నారు. కాని ఈ దేవుళ్ళు చాలరు. మన సాకారపూజ రాళ్లూ రప్పలూ మొదలైనవాటితో తృప్తిపడక మనుష్యుల్ని వెతుక్కుంటున్నది. రెండువేదాంతంముక్కలు చెప్పినవాళ్ళంతా మనకు ప్రత్యక్షదైవాలు. దేవుడివృత్తి లాభసాటిగా ఉంది. ఇప్పటి దేవుళ్లు కాఫీలు తాగొచ్చు, సిగరెట్లు కాల్చొచ్చు, నల్లమందు వేసుకోవచ్చు, బాంకులో డబ్బు దాచుకోవచ్చు. మామూలు మనుషులు చేసేపనులూ, చెయ్యటానికి వెరిచేపనులు కూడా చెయ్యొచ్చు. ఇప్పటికే ప్రత్యక్ష దేవుళ్ళకి తాకిడీ చాలా హెచ్చుగా వుంది. ఇప్పటి సంఖ్య మూడింతలైనప్పటికీ ఉన్న డిమాండుకు సరిపోదు.

దేవుడు వృత్తి జయప్రదంగా చెయ్యటానికి కొంత నేర్పు అవసరం. కాని దీనికి బడి పెట్టి నేర్పటం ఇప్పుడు పొసగదు. జర్నలిజం మోస్తరుగా ఇది బళ్ళో చదివేకంటె ప్రత్యక్షానుభవం వల్ల బాగా అబ్బుతుంది. వెనక మా వూరొచ్చిన ఒకానొక దేవుడు తన్నులు తిని వెళ్లాడు. కనక దేవుడివృత్తిలోకూడా కష్టనిష్ఠూరాలు తప్పవు. కాని ఈ కష్టనిష్ఠూరాలు అన్నివృత్తుల్లోనూ ఉండేవే గనక ఆ విషయం అంతగా అనుకోనవసరం లేదు, ఇతర ఉద్యోగాలకు పాతరికార్డు చూసినట్టు దేవుడివృత్తిలో పాతరికార్డు చూడరు.

స్వతంత్రభారతంలో ఈ దేవుడు వృత్తికి చలామణీ హెచ్చుతుందా తగ్గుతుందా అని సమస్య. ఇప్పటి లక్షణాలు చూస్తే, హెచ్చేటట్టు కనిపిస్తుంది. ఎందుచేతంటే ఉన్న దేవుళ్ళను అధికంగా పేట్రనైజు చేస్తున్నవాళ్లు ధనికవర్గంవారే. ధనికవర్గంవారు దేవుళ్ళను ప్రోత్సహించటంలో రెండు రకాల అంతరార్థం ఉంది. ధనికులు డబ్బుకోసమే బతుకుతున్నారనే భ్రమ నలుగురికీ కలగకుండా ఉండటం ఒకటీ, దేవుళ్ళ నాశ్రయించేవాళ్లకి కలిసొస్తుందనే భ్రమ బీదసాదలకు కలిగించటం మరోటీనూ. దేవుళ్ళతో ధనికులకున్న ఈ అవసరం స్వతంత్రభారతంలో హెచ్చుతుంది గాని తగ్గదు.

నామటుకు నేను దేవుడు వృత్తి తురుఫాసు కింద పెట్టుకున్నాను. ఇంకేదీ పారని పక్షంలో నేనుకూడా ఓ దేవుణ్ణయిపోయి హాయిగా కాలక్షేపం చేసుకుంటాను. నన్నడిగితే అంతకంటే గొప్పలేని ఉద్యోగం ఉండదు. దేవుడికేమీ అక్కర్లేదు గనక అన్నీ ఇస్తారు. మామూలు మనుష్యుల స్వభావంలో వుండే ఈ విచిత్ర గుణం కనిపెట్టినవాడు దేవుడివృత్తి ఉంటూఉండగా మరోవృత్తిలో వృథాగా మగ్గిపోవటానికి ఒప్పుకుంటాడా?

* ఆనందవాణి

- గమ్మత్ లెక్క -



"మేష్టారూ, ఈ లెక్క చాలా గమ్మత్ గా వుందండీ."

"ఏమిటిరా దాల్లో విశేషం?"

"ఏమీ లేదండీ, నాలుగుసార్లు కూడితే నాలుగు రకాల ఆన్సర్లు వచ్చాయండీ!!"